క్లుప్తంగా

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు. స్థానిక యూపీ పాఠశాలలో సీజనల్ హాస్టల్‌ను గురువారం ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణితో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం అనేక పథకాలను అమలుచేస్తూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మార్చారని చెప్పారు. ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ప్రతినిధులు బాల్య వివాహాలతో నష్టాలు, దీనికి సంబంధించి చట్టాలు, చైల్డ్‌లైన్ 1098పై పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కులూరి రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు నూకవరపు శ్రీనివాసరావు, హెచ్ఎం బి.లింగయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆళ్ల బాలకృష్ణ, సీజనల్ హాస్టళ్ల నిర్వాహకులు బసవపూర్ణయ్య, ప్రకాష్, కో ఆర్డినేటర్ పాము నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ముక్తేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని భవానీ ముక్తేశ్వర స్వామి కల్యాణోత్సవాలు గురువారం పవళింపు సేవతో ముగిశాయి. ఆలయ అర్చకుడు సాంబశివరావుశర్మ ఆధ్వర్యాన స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగరాజు, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

వాహనాల వేలం
రూ. 11.26 లక్షల ఆదాయం

వీరులపాడు: నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు వీరులపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్ఈబీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యాన గురువారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ 38 వాహనాల్లో 31 వాహనాలకు వేలం పాటలు నిర్వహించారన్నారు. వేలం పాటల ద్వారా రూ. 11.26 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. మిగిలిన వాహనాలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరోసారి వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. రూరల్ సీఐ నాగేంద్రకుమార్, ఎస్ఐలు సోమేశ్వరరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గొలుసు చోరీ

నందిగామ: మహిళ మెడలోని గొలుసును ద్విచక్ర వాహనంపై వచ్చి అపహరించిన ఘటన గురువారం నందిగామ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చందాపురం గ్రామానికి చెందిన గద్దె గోవర్ధన అనే మహిళ గ్రామంలోని సచివాలయానికి వెళ్లారు. అక్కడ పనులు చూసుకుని ఇంటికి వెళ్తున్నప్పుడు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆ మహిళ మెడలోని గొలుసు లాక్కొని పరారయ్యారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 30 గ్రాముల గొలుసు చోరీకి గురైందని దాని విలువ సుమారు 70 వేలకు పైగా ఉంటుందని వారు తెలిపారు.

పుచ్చసాగు.. బహుబాగు..

- కన్నెవీడు, ఇందుగపల్లి గ్రామాల్లో 200 ఎకరాల్లో సాగు
- ఖర్చుతక్కువ....ఆదాయం ఎక్కువ



కన్నెవీడు మునేరు ఒడ్డున ఉన్న భూముల్లో పుచ్చసాగు

కన్నెవీడు/ఇందుగపల్లి(వత్సవాయి): వేసవి వచ్చిందంటే గుర్తుకొచ్చేది పుచ్చకాయ. పుచ్చసాగు.. సిరులు కురిపిస్తోంది. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వస్తోంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని కన్నెవీడు, ఇందుగపల్లి గ్రామాల్లో మాత్రమే పంట సాగవుతోంది. ఈ రెండు గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో పైగా సాగుచేస్తున్నారు. మునేటి ఒడ్డున ఉన్న తువ్వ భూముల్లో సాగు జరుగుతోంది. వానాకాలంలో ఈ భూముల్లో పెసర, బొబ్బర్లు, నువ్వులు పండించిన తర్వాత డిసెంబర్‌లో పుచ్చసాగు మొదలుపెడతారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి రూ 50 నుంచి 60 వేల వరకు ఆదాయం వస్తుంది. సుమారు ఎకరానికి 15 వేల నుంచి 20 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఎకరానికి 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ 3 నుండి 5 వేల వరకు ధర పలుకుతోందని రైతులు తెలిపారు. వారం నుంచి పంట కోత మొదలుపెట్టారు. సుమారు 200 టన్నుల పుచ్చకాయలు కోశారు.

నాలుగు నెలల పంట

పుచ్చపంట నాలుగు నెలలకే చేతికి వస్తుంది. డిసెంబర్ మొదటి వారంలో విత్తనాన్ని నాటుతారు. ఫిబ్రవరి నెల చివర, మార్చి మొదటి వారంలో కాయల కోత ప్రారంభిస్తారు. ఏప్రిల్‌లో పంట పూర్తవుతుంది.
నీటి తడులు ఎక్కువగా ఉంటే కాయ సైజు పెద్దదిగా ఉంటుంది. దీన్ని బట్టి కూడా ఆదాయంలో తేడా ఉంటుంది.


లారీల్లో లోడవుతున్న పుచ్చకాయ

ఖర్చు తక్కువ

మిగతా వాణిజ్య పంటలతో పోల్చుకుంటే పుచ్చ సాగుకు ఖర్చు చాలా తక్కువ. ఈ ప్రాంతంలో ఎకరానికి 20 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. కన్నెవీడు, ఇందుగపల్లి గ్రామాల్లో పండించిన పుచ్చకాయలను కొనుగోలు చేయడానికి విజయవాడ, నందిగామ, ఇబ్రహీంపట్నం, జగ్గయ్యపేట, కోదాడ పరిసర ప్రాంతాల్లోని వ్యాపారులు టన్నుల లెక్క కొనుగోలు చేసి లారీల ద్వారా తరలించుకుంటారు.

15 ఏళ్ల నుంచి సాగు చేస్తున్నాను

కన్నెవీడులో ఎకరంన్నరలో పుచ్చ సాగు చేస్తున్నాను. 15 సంవత్సరాల నుంచి ఈ సాగు చేస్తున్నాను. ఇప్పటి వరకు సుమారు 12 వేల వరకు పెట్టుబడి పెట్టా. లాభసాటి సాగు ఇది. ఇప్పటి వరకు టన్నుకు పైగా కాయ కోత కోశాను.

– కె.రత్నబాబు, కన్నెవీడు

నాడు-నేడు పనులు పర్యవేక్షించాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను విద్యాశాఖాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సమగ్ర శిక్షా జిల్లా ఏపీసీ మహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి విద్యాశాఖ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం నాడు–నేడుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు మండలాల్లో ఫేజ్–2 కింద పాఠశాలల్లో ప్రారంభమైన పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలను ప్రభుత్వానికి అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవీందర్, నాగరాజు, సీఆర్పీలు, పంచాయతీ రాజ్ ఏఈలు, ఐఈఆర్టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ/కంచికచర్ల: బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ పాఠశాలకు వచ్చి చదువుకునేలా చూడాలని సర్వ శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మహేశ్వరరావు అధికారులకు సూచించారు. పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో గురువారం ఆయన పలు అంశాలపై సమీక్షించారు. చందర్లపాడు మండలం మునగాలపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన సీజనల్ హాస్టల్‌ను పరిశీలించారు. ఆయా కార్యక్రమాలలో ఆయన వెంట ఎంఈఓ బాలాజీ తో పాటు పలువురు సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కంచికచర్ల మండల కేంద్ర కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

పెనుగంచిప్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో విప్ ఉదయభాను


మాట్లాడుతున్న విప్ ఉదయభాను, పక్కన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ, తహసీల్దార్

పెనుగంచిప్రోలు: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చాక సుమారుగా రూ.2.50 లక్షల కోట్లు సంక్షేమ పథకాలకు వినియోగించారని తెలిపారు. నియోజకవర్గంలో రూ.100 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. రూ.14 కోట్లతో జగ్గయ్యపేట-చిల్లకల్లు రోడ్డు అభివృద్ధి జరుగుతోందన్నారు. టీటీడీ నిధులతో జగ్గయ్యపేటలో కల్యాణ మండపం నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందన్నారు. తిరుపతమ్మ ఆలయాన్ని జగన్మోహన్‌రెడ్డి పాలనలో రూ.15 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పెనుగంచిప్రోలు, గుమ్మడిదూర్రులో త్వరలో వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనిగండ్లపాడు-శివాపురం, అనిగండ్లపాడు-గుమ్మడిదూర్రు, గుమ్మడిదూర్రు-జొన్నలగడ్డ గట్టు వరకు రోడ్డు మరమ్మతులను త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పెనుగంచిప్రోలులో రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. జగనన్న కాలనీలో నీటి కోసం మోటార్లు, విద్యుత్ స్తంభాలు వెంటనే ఏర్పాటు చేయాలని విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అధికారులు సమావేశాలకు రావాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్, మైనింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల రామారావు, వైస్ ఎంపీపీలు గుంటుపల్లి వాసు, కనగాల శ్రీనివాసరావు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు జాన్ మియా, తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులే వైఎస్సార్ సీపీ బలం

ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

కంచికచర్ల : గృహ సారథులే వైఎస్సార్ సీపీ బలమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో గ్రామ సచివాలయ గృహసారథుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్ అధ్యక్షతన గురువారం రాత్రి గృహసారథులు, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఏడాదిలో కంచికచర్లను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో పట్టణ మండల పార్టీ కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



ఈనాడు తప్పుడు రాతలను ప్రజలు నమ్మరు

- గన్నవరంలో ఘర్షణలు, దాడులకు పట్టాభి కారణం
- విలేకరుల సమావేశంలో ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను


ఈనాడు కథనాన్ని చూపిస్తూ మాట్లాడుతున్న విప్ ఉదయభాను

పెనుగంచిప్రోలు: ఈనాడు దినపత్రికలో తప్పుడు కథనాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పెనుగంచిప్రోలులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గన్నవరంలో టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి తన అనుచరులతో వెళ్లి రెచ్చగొట్టే విధంగా ముఖ్యమంత్రిని, వైఎస్సార్‌సీపీ నాయకులపై విమర్శలు చేసి ఘర్షణ సృష్టించి దాడులకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు పట్టాభిపై దాడి చేయక పోయినా ఈనాడులో రామోజీరావు పాత ఫొటోలతో తప్పుడు కథనాలు రాయడం దుర్మార్గమన్నారు. పార్టీ దుస్థితికి పట్టాభి కారణమని టీడీపీ వారే అంటున్నారన్నారు. ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాస్తే విలువ తగ్గిపోతుందన్నారు. వాస్తవాలు రాస్తే స్వాగతిస్తామని చెప్పారు. తప్పుడు కథనాలపై కోర్టుల్లో కేసులు కూడా వేస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గ్రీనరీతో వాటర్ ఫౌంటెన్

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా దాతల సహకారంతో చేపట్టిన మినీ పార్కు నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. చైర్మన్ చాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాశి కిషోర్, దువ్వల రామకృష్ణ తదితరులతో కలసి ఆయన మాట్లాడారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా బస్టాండ్ ఎదురుగా గ్రీనరీ, లైటింగ్, వాటర్ ఫౌంటెన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. జగ్గయ్యపేట పట్టణానికి 25 ఏళ్లు సర్పంచ్‌గా విధులు నిర్వహించి పేటలో మొట్టమొదట రిజర్వాయర్ల ద్వారా తాగు నీరు, విద్యుత్ సదుపాయం కల్పించిన సర్దార్ సామినేని విశ్వనాథం విగ్రహాన్ని త్వరలో ఇదే స్థలంలో ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్


భూముల రీసర్వేలో భాగంగా డ్రోన్ ప్రారంభంలో సర్పంచ్ జ్యోతిబ్రహ్మం, తదితరులు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): జగనన్న భూ హక్కు–భూ రక్ష పథకంలో జరుగుతున్న భూముల రీసర్వేతో భూ సమస్యలకు చెక్ పడనుందని సర్పంచ్ జ్యోతిబ్రహ్మం అన్నారు. భూ హక్కుకు సంబంధించి గురువారం గ్రామంలో డ్రోన్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సర్వేను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. సర్వే అధికారులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, మండల పరిషత్ కో–ఆప్షన్‌సభ్యులు సయ్యద్ జాన్‌మియా, శ్రీతిరుపతమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు లగడపాటి నాగేశ్వరరావు, నెల్లూరి గోపాలరావు, అనిగండ్లపాడు, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షులు గంగూరి ప్రసాద్, లగడపాటి జనార్దనరావు, సచివాలయాల కన్వీనర్ ఉన్నం శ్రీనివాసరావు, శివాపురం ఉపసర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న శాశ్వత భూహక్కు

కంచికచర్ల: మండలంలోని పరిటాల గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా 6,208 ఎకరాలను రీ సర్వే చేసి రైతులకు పట్టాలు పంపిణీ చేశామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి అన్నారు. గురువారం ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. తహసీల్దార్ మాట్లాడుతూ మూడు రోజుల నుంచి రైతుల పొలాల్లో సరిహద్దు రాళ్లను పాతుతున్నామని తెలిపారు. రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. స్టోన్ ప్లాంటేషన్ వచ్చే నెల 15లోపు సరిహద్దురాళ్లను పాతేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఆఫ్ సర్వేయర్ నంద్రు అనూష్‌కుమార్, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలి

నగర పంచాయతీ కమిషనర్ జయరాం


సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల వివరాల చార్ట్ పరిశీలిస్తున్న కమిషనర్

నందిగామ: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. పట్టణంలోని ఆరో సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో సిబ్బంది మూమెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల జాబితాలను పరిశీలించారు. అనంతరం సచివాలయానికి వచ్చే వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే వారితో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. సచివాలయం ద్వారా అందుతున్న సేవలను సకాలంలో అందేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం చూపొద్దన్నారు. ప్రతి ఒక్కరూ మూమెంట్ రిజిస్టర్‌ను ఫాలో కావాలని ఆదేశించారు.

ప్రజా సహకారంతో పారిశుద్ధ్యం పెంపు
నందిగామ: ప్రజా సహకారంతో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణ శివారు అనాసాగరంలో గురువారం స్వచ్ఛ సంకల్పం ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థ పాలనకు ఆకర్షితులై చేరికలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ ఉదయభాను

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర్థపాలనకు ఆకర్షితులై ప్రతిపక్ష నేతలు సైతం వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గ్రామంలో కంపసాటి వెంకన్న ఆధ్వర్యంలో గురువారం పది కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఉదయభాను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పానుగంటి లక్ష్మీత్రివేణి నాయుడు, ఆర్‌బీకే చైర్మన్ పాలినేడి రవి, మాజీ చైర్మన్ బెడదం సత్యం, తదితరులు పాల్గొన్నారు.
జగ్గయ్యపేట అర్బన్: స్థానిక చెరువు బజారుకు చెందిన కుంచపు భూలక్ష్మి, తాళ్లూరి శివ, షేక్ రహీం, మక్కల జితేంద్రకుమార్, బత్తుల లక్ష్మి, సాగె గురవమ్మ, బత్తుల నరసమ్మ, దేరంగుల రేణుక తదితరులు వారి కుటుంబ సభ్యులతో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో గురువారం వైఎస్సార్ సీపీ నేత సామినేని వెంకట కృష్ణప్రసాద్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కౌన్సిలర్లు సాధుపాటి రాజు, తన్నీరు నాగేంద్ర, దువ్వల రామకృష్ణ, పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, ఎల్ఎన్.సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చేతల్లో సామాజిక న్యాయం


సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, తదితరులు

పెనుగంచిప్రోలు: చట్టసభలు, రాజకీయాల్లో సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి కొనియాడారు. 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 బీసీలకు, ఎస్సీ ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీ వర్గానికి చెందిన నలుగురికి కేటాయించి సామాజిక న్యాయం చేసిన సందర్భంగా గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలు తమ పార్టీకి పట్టుగొమ్మలని చెప్పే చంద్రబాబు ఏనాడూ ఆ వర్గాలకు ప్రాధాన్యమివ్వలేదన్నారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రికి వారి మద్దతు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మైనింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల రామారావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు గుంటుపల్లి వాసు, కనగాల శ్రీనివాసరావు, మండల ట్రేడ్ యూనియన్ నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయంలో బహిరంగ వేలం

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ దేవస్థానం వద్ద వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు గురువారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.18.12 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ లీలాకుమార్ తెలిపారు. ఏడాది పాటు ఆలయం వద్ద క్యాంటిన్ నిర్వహించడానికి లైసెన్స్‌కు పచ్చల శివప్రసాద్ రూ.6.01 లక్షలు, ఫొటోలు తీసుకునేందుకు కొత్తపల్లి సతీష్ రూ.12.11 లక్షలకు హక్కు పొందారన్నారు. ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వండి

పెనుగంచిప్రోలు: గృహాల నుంచి తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. గ్రామంలో గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరు చేసి ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దని సూచించారు. కాల్వల్లో ప్లాస్టిక్ కవర్లు, సీసాలు వేయొద్దని తెలిపారు.